# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

శనివారం | 31 ఆగస్టు, 2024 | పేజీలు : 4


## సెప్టెంబర్ 2న కలెక్టరేట్ ముందు ధర్నా




4 లో

# మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సీఎం అవుతారు: రాజగోపాల్ రెడ్డి





**ప్రజాపక్షం/యాదాద్రి :** మేడిగడ్డ కూలడం అతిపెద్ద దుఃఖపూరిత విషయమని, రాష్ట్రంలో మేడిగడ్డ, సుందిల్ల, కాళేశ్వరం ప్రాజెక్టుల భవిష్యత్తు ప్రశ్నార్ధకం అని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి నల్లమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. భువనగిరి పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో, ఉమ్మడి జిల్లాలో సాగునీటి కాలువలను పూర్తి చేసి సస్యశ్యామలం చేస్తామని రాష్ట్ర నీటి పారుదల శాఖ, సివిల్ సప్లై శాఖల మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం భువనగిరిలో జరిగిన భువనగిరి పార్లమెంటు నియోజకవర్గ స్థాయి నీటిపారుదల శాఖ పనులపై ఆయన రాష్ట్ర రెవిన్యూ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ భువనగిరి పార్లమెంటు పరిధిలో, ఉమ్మడి నల్గొండ జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులను పూర్తిచేసి సస్యశ్యామలం చేస్తానని హామీ ఇస్తున్నానని, అది నా ధర్మమని అన్నారు. బునాదిగాని కాలువకు 269 కోట్లు, పిల్లాయిపల్లి కాలువకు 86 కోట్లు, ధర్మారెడ్డి కాల్వకు 133 కోట్ల అవసరమని అన్నారు. సాగునీటి ప్రాజెక్టుల కోసం అవసరమైన భూసేకరణను శాసనసభ్యులు పూర్తి చేయాలని కోరారు. గత పది ఏళ్లలో అనాలోచిత విధానాలతో లక్ష 80 వేల కోట్లు ఖర్చు చేశారని, మన ప్రభుత్వం వచ్చాక పాత కొత్త కాలువల విభేదాలు లేకుండా అన్ని ప్రాజెక్టులను తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టు సాగులోనికి వచ్చే విధంగా చేస్తామని అన్నారు. బునాదిగాని, పిల్లయిపల్లి, ధర్మారెడ్డి కాలువలకు ఖచ్చితమైన హామీ ఇస్తున్నామని, ఎన్ని నిధులైన మంజూరు చేస్తామని అన్నారు. ముఖ్యమంత్రి ఆలోచన మేరకు హైదరాబాద్ మూసి ప్రక్షాళన చేస్తామని అన్నారు. శాసనసభ్యులు భూసేకరణ వెంటనే చేస్తే ఒక సంవత్సరంలో పనులు పూర్తి చేయవచ్చని అన్నారు. దేవాదుల ప్రాజెక్టును సమీక్షించడం జరిగిందని, భవిష్యత్తులో భువనగిరి ప్రాంతానికి దేవాదుల నుండి లక్షల ఎకరాలకు సాగునీళ్లు వస్తాయని, దేవాదుల ప్రాజెక్టుకు అధిక ప్రాధాన్యత ఇచ్చి రెండేళ్లలో పూర్తి చేస్తామని తెలిపారు. లిఫ్ట్ ఇరిగేషన్లు, చెక్ డాములు పూర్తి చేస్తామని తెలియజేస్తూ చెరువులను ఆక్రమిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని ముఖ్యమంత్రిగా సంబోధిస్తూ మునుగోడు ఎమ్మెల్యే కోమటి రెడ్డి రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గం స్థాయిలో జరుగుతున్న నీటి పారుదల ప్రాజెక్టు సమీక్ష సమావేశంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో పాటు రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హాజరయ్యారు. రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ సీఎంగా సంభోదించారు. నాలుక కరుచుకున్న ఆయన నా నాలుక పై మచ్చలు ఉన్నాయి. నేను అన్నది అవుతుంది ఏనాటికైనా ఉత్తం సీఎం అవుతారని అన్నారు. ఆయనకు సీఎం అయ్యే అర్హతలు అన్నీ ఉన్నాయన్నారు. దీంతో సభలో పాల్గొన్న వారంతా ఒక్కసారి ఆశ్చర్యానికి గురయ్యారు.



## సాగర్ రిజర్వాయర్‌కు కొనసాగుతున్న
# వరద ఉధృతి



**ప్రజాపక్షం/నందికొండః** రెండు రోజులుగా నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు శ్రీశైలం నుంచి భారీగా వరద ప్రవాహం వచ్చి చేరుతుంది దీనితో గురువారం 26 గేట్ల ద్వారా నీటి విడుదలను కొనసాగించిన ప్రాజెక్టు అధికారులు శుక్రవారం కూడా 26 గేట్ల ద్వారా నీటిని కొనసాగిస్తున్నారు.8 గేట్లను 10 అడుగులు, 18 గేట్లను 5 అడుగుల మేర ఎత్తి 262430 క్యూసెక్కుల నీటిని ప్రాజెక్టు అధికారులు అవుట్ ఫ్లో గా దిగువకు విడుదల చేస్తున్నారు. ఇంకా నాలుగు రోజులు ఇదేవిధంగా నీటి విడుదల కొనసాగుతుందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

**✻ రిజర్వాయర్ సమాచారం....**

సాగర్ రిజర్వాయర్ పూర్తిస్థాయి గరిష్ట నీటిమట్టం 590 అడుగులు కాగా ప్రస్తుతం 589 అడుగులుగా ఉంది. ఇది 312.0450 టిఎంసిలకు సమానం. ప్రధాన జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం నుండి 29354 క్యూసెక్కులు కుడి కాలువ ద్వారా 9633 క్యూసెక్కులు ఎడమ కాలువ ద్వారా 8280 క్యూసెక్కులు ఎస్ఎల్బీసీ ఏఎమ్ఆర్పి ద్వారా1800 క్యూసెక్కులు లోలెవెల్ కెనాల్ వరద కాలువ ద్వారా 600 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టుకు భారీగా వరద ప్రవాహం వచ్చి చేరుతూ ఉండటంతో ప్రాజెక్టుకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఇన్ ఫ్లో గా వస్తున్న 312097 క్యూసెక్కుల నీటిని అంతే మొత్తాన్ని అవుట్ ఫ్లో గా దిగువకు విడుదల చేస్తున్నారు.

# ఎల్ఆర్ఎస్ ప్రక్రియ వేగవంతం చేయాలి



**ప్రజాపక్షం/నల్లగొండః** అన్ని మున్సిపాలిటీలు, మండలాలలో ఎల్ఆర్ఎస్ ప్రక్రియను వేగవంతం చేయాలని, వచ్చేవారం నాటికి ప్రతి మున్సిపల్ కమిషనర్ కనీసం 50 దరఖాస్తులైన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆదేశించారు.శుక్రవారం అయన జిల్లా కలెక్టర్ కార్యాలయం నుండి వివిధ అంశాలపై జిల్లా మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరుకాని దేవరకొండ మున్సిపల్ కమిషనర్, నకిరేకల్ మున్సిపల్ కమిషనర్, టిపిఓ ఇంజనీర్ రెవిన్ ఇన్స్పెక్టర్లకు మెమో జారీ చేయాలని ఆదేశించారు.అన్ని మున్సిపాలిటీలు, మండలాలలో ఎల్ఆర్ఎస్ ప్రక్రియ వేగవంతం చేయాలని, మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఓలు ఎల్ఆర్ఎస్ బృందాలతో సమన్వయం చేసుకొని ఎక్కువ దరఖాస్తులు పరిష్కరించేలా చూడాలని చెప్పారు. ఓటరు జాబితా మెర్జింగ్, మ్యాపింగ్‌లపై జిల్లా కలెక్టర్ సమీక్షిస్తూ ఆర్‌డిఓలతో సమన్వయం చేసుకొని సెప్టెంబర్ ఒకటి నాటికి టి.పోల్ పోర్టల్ లో మెర్జింగ్, మ్యాపింగ్, పూర్తి చేయాలని,సెప్టెంబర్ మూడవ తేదీ నాటికి మాన్యువల్ పరిశీలన సైతం పూర్తి చేయాలని చెప్పారు. అసెంబ్లీ నియోజకవర్గ ఓటరు జాబితాలో ప్రతి పోలింగ్ కేంద్రంలో ఎంత మంది ఓటర్లు ఉన్నారు ఏ హ్యాబిటేషన్ గ్రామపంచాయతీ కిందికి వస్తుందో అలాంటి వివరాలను తయారు చేయాలని ఆదేశించారు. ఫిబ్రవరి 9 నుండి ఇప్పటి వరకు ఓటరు జాబితాలో తొలగింపులు, చేర్పుల వివరాలు సేకరించాలన్నారు. సెప్టెంబర్ 4 నుండి పోలింగ్ కేంద్రాలను గుర్తించడం జరుగుతుందని, నాలుగు నుండి పది వరకు ఎంపిడిఓలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించి పోలింగ్ కేంద్రాలలో అన్ని సౌకర్యాలు ఉన్నది లేనిది తనిఖీ చేయాలన్నారు. సెప్టెంబర్ 15 నాటికి ముసాయిదా పోలింగ్ కేంద్రాల జాబితాను తనకు పంపించాల్సిందిగా ఆదేశించారు. రానున్న మూడు నెలలపాటు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని,అవసరమైతే ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాల డాక్టర్లు వారి పరిధిలో జ్వర సర్వేను మరోసారి నిర్వహించాలని, శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ ఏర్పాటు చేయాలని, ఫాగింగ్ తో పాటు, స్ప్రేయింగ్ ను, అలాగే మొక్కలు తొలగించే కార్యక్రమాన్ని తీవ్రతరం చేయాలని ఆదేశించారు.వచ్చే మంగళవారం నుండి జిల్లా వ్యాప్తంగా శానిటేషన్, ప్లాంటేషన్ పై ఆడిట్ బృందాలు గ్రామాలు, మున్సిపాలిటీలలో పరిశీలన జరపనున్నాయని, ఈ పరిశీలనలో ఎక్కడైనా పారిశుధ్య లోపం కనపడిన, మొక్కలు లేనట్లు తేలిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో ఇప్పటివరకు వనమహోత్సవం కింద మొక్కలు నాటే కార్యక్రమం 99 శాతం పూర్తయిందని, అన్ని సంస్థలు, పల్లె ప్రకృతి వనాలు, బృహత్ పల్లె ప్రకృతి వనాలలో నాటిన మొక్కలన్నింటిని పరిశీలించడం జరుగుతుందని ,ఏ ఒక్క అధికారి మొక్కలు విషయంలో నిర్లక్ష్యం వహించవద్దని, అవసరమైతే మొక్కలు లేని చోట సంబంధిత అధికారుల నుండి రికవరీ చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ టి.పూర్ణచంద్ర, జడ్‌పి సిఈఓప్రేమ్ కరణ్ రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి మురళి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పుట్ల శ్రీనివాస్, జిల్లా సంక్షేమ అధికారి సక్కుబాయి, ఆర్‌డిఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఓలు, ఎంపిలు, ఇరిగేషన్ ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

# కామ్రేడ్ అనసూర్యమ్మ ఆశయ సాధనకు కృషి

**ప్రజాపక్షం/మునగాల:** నమ్మిన సిద్ధాంతం కోసం తన తుదిశ్వాస విడిచే వరకు కమ్యూనిస్టుగా బ్రతికిన కామ్రేడ్ ముదిరెడ్డి అనసూర్యమ్మ మరణం సిపిఎం పార్టీకి తీరనిలోటి ఆమె ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు పిలుపునిచ్చారు.శుక్రవారం మండలంలోని నర్సింహుల గూడెం గ్రామంలో జరిగిన ముదిరెడ్డి అనసూర్యమ్మ దశదిన కార్యక్రమం సందర్భంగా ఆయన హాజరై ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించి మాట్లాడారు.గ్రామంలో కమ్యూనిస్టు పార్టీ అభివృద్ధి కోసం కృషి చేసిన దాంట్లో అనసూర్యమ్మ కుటుంబం చేసిన త్యాగం మరువ లేనిదన్నారు.గ్రామంలో ఆరాచాక కాంగ్రెస్ పార్టీ దాడులను దౌర్జన్యాలను ఎదుర్కొంటూ పార్టీ ఎదుగుదల కోసం అనసూయమ్మ కృషి చేశారన్నారు.తన ఇద్దరు కుమారులు కామ్రేడ్ ముదిరెడ్డి ఆదిరెడ్డి,ముదిరెడ్డి శ్రీనివాసరెడ్డిలు దారుణ హత్యకు గురైన బెదరకుండా ధైర్యంతో నిలబడి కమ్యూనిస్టు పార్టీని నిలబెట్టి కార్యకర్తలను కాపాడటంతో అనసూర్యమ్మ కీలక పాత్ర పోషించారన్నారు.నేటి ఆమె చూపిన బాటలో వారి మిగతా కుటుంబ సభ్యులు కూడా అదే ఎర్రజెండా నీడలో పని చేయడం అభినందనీయమన్నారు.అనసూర్యమ్మ భౌతికంగా దూరమైన ఆమె ఆశయాల సాధన కోసం ఉద్యమాలు ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు.సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ మునగాల పరగణాలో నర్సింహుల గూడెం గ్రామంలో పార్టీ కార్యకర్తలను కాపాడటంలో తన భర్త రంగారెడ్డి అడుగుజాడల్లో పనిచేయడంలో అనసూర్యమ్మ ముందు భాగంలో ఉందన్నారు.అనేక మంది కార్యకర్తలపై ప్రత్యర్థి పార్టీల నాయకులు దాడులు, దౌర్జన్యాలు చేస్తూ అక్రమ కేసులు బనాయించిన వాటన్నింటిని ధైర్యంగా ఎదుర్కొన్న ధీశాలి అనసూర్యమ్మ అని తెలిపారు.గ్రామంలో జరిగిన పార్టీ కార్యక్రమాలలో అనసూయమ్మ పాత్ర మరువలేనిదని ఆమె ఆశయాలు సాధించేందుకు ప్రతి సిపిఎం కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి,సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మేదరమెట్ల వెంకటేశ్వరరావు కోట గోపి, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు దేవరం వెంకటరెడ్డి,పల్లె వెంకటరెడ్డి,వట్టెపు సైదులు, మిట్టగడుపుల ముత్యాలు,సిపిఎం మండల కార్యదర్శులు చందా చంద్రయ్యరాపోలు సూర్య నారాయణ,మాజీ గ్రామ సర్పంచ్ జూలకంటి కొండారెడ్డి,మాజీ ఎంపిటిసి జూలకంటి విజయలక్ష్మి,నాయకులు పోసనబోయిన హుస్సేన్,శీలం శ్రీను, సిపిఎం మండల కార్యదర్శివర్గ సభ్యులు బచ్చలకూర స్వరాజ్యం,షేక్ సైదా,స్టాలిన్ రెడ్డి,తుమ్మల సతీష్,మారం వెంకటరెడ్డి,ఉదయమ్మ,అబ్రహం, వెంకన్న, అచ్చయ్య,కొండయ్య పాల్గొన్నారు.



## ట్రైనీ కానిస్టేబుల్ ఆత్మహత్య



**ప్రజాపక్షం/చింతపల్లి :** ఏఆర్ ట్రైనీ కానిస్టేబుల్ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానిక ఎస్ఐ యాదయ్య తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన పాలకుర్ల ఆంజనేయులు (24) ఏఆర్ కానిస్టేబుల్‌కు అర్హత సాధించి హైదరాబాదులోని గోషమహాల్ ట్రైనింగ్ సెంటర్లో శిక్షణ తీసుకుంటున్నాడు. సెలవులో భాగంగా ఈ నెల 25వ తేదీన హైదరాబాదు నుండి తన స్వగ్రామమయిన చింతపల్లికి వచ్చాడు. 28వ తేదీ ఉదయం తమ వ్యవసాయ బావి వద్ద స్నానం చేసి వస్తానని తన కుంటుంబ సభ్యులకు చెప్పి బావి వద్దకు వెళ్లాడు. బావి వద్దకు వెళ్లిన ఆంజనేయులు ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు బావి వద్దకు వెళ్లి చూడగా పురుగుల మందు తాగినట్టు గుర్తించారు. దీంతో వెంటనే వారు చికిత్స నిమిత్తం మాల్ పీపుల్స్ ఆసుత్రికి తీసుకెళ్లి, మెరుగైన వైద్యం కోసం బంజారా హిల్స్‌లోని కేర్ ఆసుపత్రికి తరలించారు. ఆంజనేయులు చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. అయితే కొన్ని రోజుల నుండి మృతుడి మానసిక పరిస్థితి సరిగ్గా లేక గుబులుగా ఉందని చనిపోతానని కుటుంబ సభ్యులతో అంటుండేవాడని మృతుడి తండ్రి తెలిపారు. మృతుడి తండ్రి సత్తయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ యాదయ్య తెలిపారు.

## ఆకస్మిక మృతి



**ప్రజాపక్షం/గుండాల:** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం సుద్దాల మాజీ పాల సెంటర్ చైర్మన్ యెగమటి సుదర్శన్‌రెడ్డి(73) శుక్రవారం గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందడం బాధాకరం అని ఆలేరు మాజీ ఎంఎల్‌ఏ గొంగిడి సునిత మహేందర్‌రెడ్డి అన్నారు. రోజు మాదిరిగానే ఉదయం తన వ్యవసాయ క్షేత్రంలో వ్యవసాయ పనుల నిర్వహిస్తున్న తరణంలో ఒక్కసారిగా గుండె పోటు రావడంతో అక్కడికక్కడే మరణించడం జరిగిందని సుదర్శన్ రెడ్డి మృతి పార్టీకి ఆయన కుటుంబానికి తీరని లోటు అని ఆమె అన్నారు. శుక్రవారం ఆయన స్వగ్రామంలో ఆయన పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేస్తూ కుటుంబానికి మనోధైర్యాన్ని కల్పించారు. వారి వెంట గడ్డమీది పాండరి, మొగులాల్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

## సామాన్య ప్రజల హక్కులను కాలరాస్తుంది




**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** ప్రస్తుతం దేశంలో పాలకవర్గ తీవ్ర అణచివేతకు పాల్పడుతూ ఆదివాసీ ప్రజల హక్కులను పీడిత ప్రజల హక్కులను సామాన్య ప్రజల హక్కులను కాలస్తుందని దీనిని ప్రకటించవలసిన అవసరం ఎంతైనా ఉందని హైకోర్టు సీనియర్ అడ్వకేట్ వి.రఘునాథ్ అన్నారు. శుక్రవారం టిఎన్జీవోస్ భవన్‌లో ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ప్రజాహక్కుల పరిరక్షణ మన కర్తవ్యం అనే అంశంపై చర్చావేదిక నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుద్ధిజీవులు మందు వరుసలో ఉండి ప్రతిఘటనా ఉద్యమాలు నిర్వహించినప్పుడే ప్రజల హక్కులు రక్షించబడతాయన్నారు. చర్చావేదికలో పాల్గొన్న వారందరూ కేంద్ర ప్రభుత్వం ఆదివాసిల నిర్మూలన ఒక లక్ష్యంగా పని చేస్తుందని, దీనికి ఈ దేశ సహజవనరులను విదేశీ, స్వదేశీ బహుళ జాతి సంస్థలకు దోచి పెట్టడానికేనని దీనిని నిరోధించాలంటే ప్రజాస్వామిక శక్తులు ఐక్యంగా ఉద్యమించాలన్నారు. అడ్వకేట్ దర్శనం నర్సింహ అధ్యక్షతన జరిగిన ఈ చర్చా వేదికలో సిహెచ్ గురువయ్య, ఎం.అంజిరెడ్డి, కె.అనంతరెడ్డి,పి.గోపాల్‌రెడ్డి, వీరా నాయక్, సిహెచ్ సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి నిర్మూలన కోసం ర్యాలీ



**ప్రజాపక్షం/మాడుగులపల్లి:** మాడుగులపల్లి మండల కేంద్రంలో గంజాయి నిర్మలన కొరకు మండల మహిళ సమాఖ్య ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి తదనంతరం నార్కట్ పల్లిఅద్దంకి రహదారిపై మానవహారం నిర్వహించి గంజాయి , ఇతర మత్తు పదార్థాలు తీసుకోవడం వలన జరిగే అనార్ధాలను డిఆర్‌డిఏ డిపిఎం (ఎఫ్ఐ) ఎస్ రామలింగయ్య వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం బాషపాక చంద్రశేఖర్, ఎంఎంఎస్ అధ్యక్షురాలు ఆర్.ఉషారాణిలు,సిసిలు నాగయ్య,సైదులు,స్వాగత్ రావు,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీపతి ల్యాబ్‌లో పేలిన రియాక్టర్



**ప్రజాపక్షం/చిట్యాల:** నల్లగొండ జిల్లా చిట్యాల మండలం గుండ్రాంపల్లి గ్రామ శివారులో గల శ్రీపతి ల్యాబ్స్(కెమికల్ ఫ్యాక్టరీ)లో రియాక్టర్ పేలిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో కార్మికులందరు ప్రాణాపాయం నుండి తప్పించుకున్నారు. ఉదయం సుమారు 7గంటల సమయంలో పరిశ్రమలోని క్యూ3 బ్లాక్‌లోని రియాక్టర్ పేలి పెద్ద శబ్ధంతో మంటలు చెలరేగాయి. కార్మికులు సమీపంలో ఉన్నప్పటికి వారు అప్రమత్తంగా ఉండటంతో వారు ఎలాంటి గాయాలకు గురికాలేదు. కాని పరిశ్రమలో పెద్ద ఎత్తున మంటల చెలరేగిన ఘటనలో పెద్ద ఎత్తున ఆస్థి నష్టం వాటిల్లినట్లు తెలుస్తుంది.

## భద్రతలేని పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలి



**ప్రజాపక్షం/చిట్యాల:** శ్రీపతి ల్యాబ్‌లో తరచుగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని, భద్రతలేని ఇలాంటి పరిశ్రమలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని గుండ్రాంపల్లి సిపిఐ గ్రామ శాఖ కార్యదర్శి జిల్లా సత్యం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వెల్మినేడు, పిట్టంపల్లి తదితర ప్రాంతాలలో వెలిసిన అనేక కెమికల్ పరిశ్రమలలో కార్మికుల జీవితాలకు భద్రత లేదని ఇప్పటికి జరిగిన ప్రమాదాలలో పలువురు చనిపోయారని, అనేక మంది క్షతగాత్రులయ్యారని సత్యం ఆవేదన వ్యక్తం చేశారు.

## గ్రామాభివృద్ధి కమిటీల నిర్వహణ



**ప్రజాపక్షం/నాంపల్లి:** నాంపల్లి మండలానికి సంబంధించి మండల పరిధిలోని తుంగపాడు, మలప్పురాజుపల్లి, చలవాని కుంట, శర్భాపురం, దేవత్‌పల్లి, రేఖ్యతండాలలో మునుగోడు ఎంఎల్ఏ కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఆదేశానుసారం శుక్రవారం గ్రామాభివృద్ధి కమిటీలను కాంగ్రెస్ మండల అధ్యక్షులు కత్తి రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ఎరెడ్ల రఘుపతిరెడ్డి, మాజీ ఎంపిపి పూల వెంకటయ్య, మండల నాయకులు సంజీవరెడ్డి, పానగంటి వెంకటయ్యగౌడ్, మాజీ సర్పంచ్ కలకొండ దుర్గయ్య, యాదగిరి, యూత్ కాంగ్రెస్ నాయకులు రాజు, శివ, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కార్మికులు చనిపోయినా పట్టించుకునేవారు లేరు



**ప్రజాపక్షం/చిట్యాల:** పరిశ్రమలలో కార్మికులు చనిపోయినా పట్టించుకునే నాధులు లేని పరిస్థితి మండలంలో నెలకొని ఉందన్నారు. జాగ్రత్తలు పాటించుకుండా పరిశ్రమలను నడపటం కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయని, ఇదే శ్రీపతి ల్యాబ్‌లో గతంలో బీహార్ రాష్టానికి చెందిన కార్మికుడు చనిపోతే గుట్టు చప్పుడు కాకుండా అతని కుటుంబానికి నష్టపరిహారం చెల్లించి సమస్యను పరిష్కరించుకున్నారని విమర్శించారు. పరిశ్రమలపై ప్రభుత్వ తనిఖీలను పెంచాలని లింగస్వామి డిమాండ్ చేశారు.

## శ్లోకాల పోటీలలో విద్యార్థుల ప్రతిభ



**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి:** త్రైత సిద్దాంతం ప్రభోద సేవా సమితి తరుపున నల్గొండ కమిటి ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలలో భాగంగా శుక్రవారం కొండమల్లేపల్లి లో నిర్వహించిన భగవద్గీత శ్లోకాల పోటీలలో ప్రతిభ కనబరిచి సాయి సిద్దార్ధ పాఠశాల విద్యార్థి కార్తిక్ ప్రథమ బహుమతి, గౌతమి స్కూల్ విద్యార్థి విద్య ద్వితియ బహుమతి, శ్రీ కృష్ణవేణి విద్యార్థి కిరణ్ తృతీయ బహుమతులను పొందారు. ఈకార్యక్రమంలో త్రైత సిద్దాంతం నల్గొండ సేవా సమితి, హిందూ జ్ఞాన వేదిక నల్గొండ కమిటి అధ్యక్షుడు, సభ్యులు పడిగిమర్రి వెంకటేశం, మేకల శ్రీనివాసులు, మేకల చంద్రమౌళి, చక్రదర్, పరమేశ్, కార్తిక్, రంగారెడ్డి, వెంకటమ్మ, కవిత, వివిధ పాఠశాలల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మేధోమదన సదస్సు జయప్రదం చేయండి

**ప్రజాపక్షం/నల్లగొండ :** తెలంగాణ లైబ్రరీస్ డెవలప్మెంట్ ఫోరం ఆధ్వర్యంలో ఉమ్మడి ఈ నెల 1న నల్లగొండ జిల్లా గ్రంధాలయాల అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన మేదోమదన సదస్సును జయప్రదం చేయాలని ఉమ్మడి నల్లగొండ జిల్లా పూర్వ గ్రంథాలయ చైర్మన్ గాదె వినోద్ రెడ్డి అన్నారు. ఉమ్మడి జిల్లాలో సాంఘిక రాజకీయ వికాస ప్రగతిశీల అభ్యుదయ ఉద్యమాలను ప్రభావితం చేయడంలో గ్రంధాలయాలు కీలకపాత్ర పోషించాయి ప్రస్తుత పరిస్థితులలో నిరాధారణకు గురి అవుతున్న ఈ సందర్భంలో ఉమ్మడి జిల్లాలోని గ్రంథాలయాలను అభివృద్ధి చేసుకోవడం కోసం జిల్లాలోని పుస్తక ప్రియులు గ్రంథాలయ పోషకులు స్వచ్ఛంద సంస్థలు రచయితలు, కవులు ప్రగతిశీల ప్రజాస్వామికవాదులతో ఉమ్మడి జిల్లా కేంద్రంలో మేధోమదన సదస్సు ప్రారంభం అవుతుందని జిల్లా మంత్రులు, ఎంఎల్ఏలు, రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ తదితరులు హాజరుకానున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో విపంచి ఫౌండేషన్ చైర్మన్ అనుముల శ్రీనివాస్, తెలంగాణ లైబ్రరీ డెవలప్మెంట్ ఫోరం ప్రతినిధి మోత్కూరు శ్రీనివాస్ వెల్లంకి లక్షణాచారి, తదితరులు పాల్గొన్నారు.

## మెగా టాలెంట్ టెస్ట్



ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్‌: సైనిక్ స్కూల్లో తమ పిల్లలను చదివించాలనుకునే తల్లిదండ్రుల కలలను సాకారం చేసేందుకు ప్రతిష్ఠాత్మకంగా సూర్యాపేట జిల్లా కేంద్రంలో కలెక్టర్ కార్యాలయం రోడ్డు 100 ఫీట్ల రోడ్డులోని శ్రీ సాయి వైష్ణవి సైనిక్ అకాడమిని ప్రారంభిస్తున్నట్లు మేనేజింగ్ డైరక్టర్ గొట్టిపర్తి శ్రీకాంత్, అకాడమిక్ డైరక్టర్ జి.కృష్ణలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సైనిక్ అకాడమిలో ప్రవేశం పొందడానికి సెప్టెంబర్ 1న 5,6,7,8 తరగతుల విద్యార్థులకు మెగా టాలెంట్ టెస్టును నిర్వహించనున్నట్లు తెలిపారు. 5,6 తరగతులకు సెప్టెంబర్ 1న ఉదయం 10 గంటల నుండి 12 గంటల వరకు, 7,8 తరగతులకు మధ్యాహ్నం 2 గంటల నుండి 4 గంటల వరకు టాలెంట్ టెస్ట్ నిర్వహించనున్నట్లు తెలిపారు. పది రోజుల పాటు డెమో నిర్వహించడం జరుగుతుందని సీట్లు పరిమితంగా ఉన్నాయని, పూర్తి వివరాలకు 9951231639, 99514336 6ను సంప్రదించాలన్నారు. మెగా టాలెంట్ టెస్ట్‌లో పాల్గొనే విద్యార్థులు ఈనెల 31 వరకు పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

## డయాగ్నస్టిక్స్ సెంటర్ ప్రారంభం



ప్రజాపక్షం/నార్కట్‌పల్లి: పట్టణంలో సంధ్య డయాగ్నస్టిక్స్ సెంటర్ ను నార్కట్‌పల్లి మండల మాజీ జెడ్‌పిటిసి దూదిమెట్ల సత్తయ్య యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యమైన వైద్య పరీక్షలు నిర్వహించి ప్రజా ఆరోగ్య సేవకు అంకిత భావంతో మెలగాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాదాసు నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఆర్థిక సహాయం



ప్రజాపక్షం/రామన్నపేట: తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమ నేత, ప్రజా సేవకుడు బీఆర్ఎస్ మాజీ రాష్ట్ర పోలిట్ బ్యూరో సభ్యుడు డాక్టర్ చెరుకు సుధాకర్ పుట్టినరోజు సందర్భంగా తెలంగాణ ఉద్యమ నేత, బీఆర్ఎస్ మాజీ జిల్లా ఉపాధ్యక్షుడు, సామాజిక కార్యకర్త ఎస్‌కె.చాంద్ డాక్టర్ సుధాకర్‌కు శుభాకాంక్షలు తెలుపుతూ స్థానిక బాలుర ప్రాథమిక పాఠశాల పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం అందచేశారు. కార్యక్రమంలో ఎం.సైదులు, డి.నరసింహా, తదితరులు ఉన్నారు.

## కొలువుదీరిన శ్రీ నల్ల పోచమ్మ దేవి




ప్రజాపక్షం/భూదాన్‌పోచంపల్లి:పట్టణ కేంద్రంలో గత మూడు రోజుల నుంచి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమాలలో భాగంగా శాస్త్రోక్తంగా మంత్ర యంత్ర తంత్రాల హోమాది పూజలు నిర్వహించి కొత్తగా పునర్నిర్మించుకున్న ఆలయంలో శ్రీ నల్ల పోచమ్మ దేవి శుక్రవారం కొలువైంది. విగ్రహ ప్రతిష్టాపన అనంతరం దేదీప్యమానంగా వెలుగుతున్న అమ్మవారి విగ్రహాన్ని చూసి భక్తులు విశేష పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు కట్కూరీ పాండురంగం గౌడ్, గౌరవ అధ్యక్షులు కొయ్యడ నరసింహ గౌడ్, గునిగంటి మల్లేశం గౌడ్, తండ వెంకటేశం గౌడ్, ఉపాధ్యక్షులు ఉబ్బికార్ సాహెప్, బోగ చంద్రశేఖర్, ప్రదాన కార్యదర్శి బొడిగె లింగంగౌడ్, సహయ కార్యదర్శులు మంగళపల్లి రాజారమేష్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలి




ప్రజాపక్షం/మర్రిగూడ: ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న బిల్లులు అన్నింటిని వెంటనే విడుదల చేయాలని టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర సాంస్కృతి కమిటీ కన్వీనర్ నల్ల నరసింహ అన్నారు. మర్రిగూడ మండల మహాసభలకు ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని మాట్లాడుతూ ఉపాధ్యాయులు తమకు రావాల్సిన హక్కులకు పోరాడుతూ సంఘ కార్యక్రమాల్లో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. యుటిఎఫ్ సంఘం నియమాలకు లోబడి క్రమశిక్షణతో నిబద్ధతతో ఉపాధ్యాయులు పని చేయాలని అన్నారు. ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు తమ వంతు కృషి చేయాలని అన్నారు. టిఎస్ యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి కాశిరెడ్డి కృష్ణారెడ్డి మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న నాలుగు డిఎ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎం జె ఆర్ బిఈడి కళాశాలలో ఆ సంఘం అధ్యక్షురాలు పి.పరమేశ్వరి అధ్యక్షతన జరిగిన మండల మహాసభ కార్యక్రమంలో మహేశ్వరం వెంకటేశ్వర్లు ,పున్నకృష్ణయ్య, నాగవరం శ్రీనివాసరావు,పోతుగంటి స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

## అందరి సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం



ప్రజాపక్షం/హుజూర్‌నగర్: అందరి సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మున్సిపల్ చైర్ పర్సన్ గెల్లి అర్చనరవి,వైస్ చైర్మన్ కోతి సంపత్‌రెడ్డిలు అన్నారు. శుక్రవారం మున్సిపాలిటి పరిధిలోని 25వ వార్డుకు చెందిన లబ్ధిదారులైన బుడిగ భారతమ్మ,దగ్గుపాటి రాణి, గడ్డం ఉమావీరయ్యలకు మంజూరైన సిఎం సహాయనిధి చెక్కులను వారు 4 వార్డు కౌన్సిలర్ ఓరుగంటి నాగేశ్వరరావు,25వ వార్డు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి సులువ చంద్రశేఖర్‌తో కలసి చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ చరిత్రలోనే ఒకేసారి రైతులకు రుణమాఫీ చేసిన ఘన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కిందని,రుణమాపీ కానీ వారు ఎటువంటి ఇబ్బంది పడాల్సిన అవసరం లేదని తప్పనిసరిగా రుణమాఫీ జరుగుతుందన్నారు.రుణమాఫీ ఒకేసారి చేస్తే తట్టుకోలేని ప్రతిపక్షాలు లేనిపోని నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నాయని అన్నారు.కొత్త రేషన్‌కార్డులను ప్రభుత్వం త్వరలోనే ఇవ్వనున్నదని,సెప్టెంబర్ 17 నుండి పది రోజుల పాటు ప్రజల వద్ద నుండి రేషన్‌కార్డు,హెల్త్ కార్డు కొరకు ప్రజాపాలన నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కీర్తన గోల్డ్ షాపును ప్రారంభించిన మున్సిపల్ చైర్ పర్సన్,వైస్ చైర్మన్ :

పట్టణంలోని ప్రధాన రహదారిపై ఉన్న బూర్లె ప్రతాప్ కాంప్లెక్స్ నందు నూతనంగా ప్రారంభించిన కీర్తన గోల్డ్ లోన్ ఫైనాన్స్ బ్రాంచ్‌ను మున్సిపల్ చైర్ పర్సన్ గెల్లి అర్చనరవి,వైస్ చైర్మన్ కోతి సంపత్‌రెడ్డి, 4వ వార్డు కౌన్సిలర్ ఓరుగంటి నాగేశ్వరరావులు ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గోల్డ్ షాపు నిర్వాహకులు వినియోగదారులకు నాణ్యమైన సేవలను అందించాలన్నారు.

## విషజ్వరాల నుండి ప్రజా ఆరోగ్యాన్ని రక్షించాలి



ప్రజాపక్షం/హుజూర్‌నగర్‌రూరల్: అంటువ్యాధులు,విషజ్వరాల భారీ నుండి ప్రజా ఆరోగ్యాన్ని రక్షించాలని సిపిఎం మండల కార్యదర్శి పోసనబోయిన హుస్సేన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.శుక్రవారం మండలంలోని అమరవరం గ్రామంలో ఆయన విష జ్వరాల సమస్యలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అంటువ్యాధులపై,విష జ్వరాల నుండి ప్రజలు రోగాల భారిన పడుతున్న వాటి నివారణకు చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందని ఆయన విమర్శించారు.మండల వ్యాప్తంగా ప్రజలు విషజ్వరాల బారిన పడి ఇబ్బందులు పడుతుంటే వాటిని పరిష్కరించాల్సిన డాక్టర్లు,అధికారులు నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.అన్ని గ్రామాలలో పారిశుద్ధ్య పనులు వేగవంతం చేసి దోమల నివారణకు చర్యలు చేపట్టాలని కోరారు. పిహెచ్‌సిలలో 24 గంటల వైద్యం అందేలా చూడాలన్నారు.కార్యక్రమంలో సిపిఎం గ్రామశాఖ కార్యదర్శి షేక్ ఖాసీం,సైదా, సీతారాములు,గోవిందు,పున్నయ్య, మహేష్,సౌభాగ్యము,వెంకన్న,బాల సైదులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలి...



ప్రజాపక్షం/మిర్యాలగూడ: ప్రజా సమస్యలు పరిష్కారం కావాలంటే ఉద్యమించాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని తక్కెళ్లపాడు గ్రామంలో పార్టీ నాయకుడు కిషన్‌రావు 34వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి రంగారెడ్డి మాట్లాడారు. కిషన్‌రావు పేద ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటాలు నిర్వహించారన్నారు. అమరవీరుల ఆశయాలు సిద్ధించాలంటే ప్రతిపెల్ల పోరాటాలకు నెలవుగా మారాలన్నారు. కార్యక్రమంలో డబ్బికార్ మల్లేష్, వీరేపల్లి వెంకటేశ్వర్లు, రవినాయక్, చౌగాని సీతారాములు, రొండి శ్రీను, రాగిరెడ్డి మంగారెడ్డి, పాదూరి గోవర్ధని, చౌగాని వెంకన్న, ఉన్నం వెంకటేశ్వర్లు, వినోద్, నాగయ్య, లింగయ్య, నర్సయ్య, రాములు, వెంకటయ్య, శ్రీను, దుర్గమ్మ, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారులకు వైద్య పరీక్షలు



ప్రజాపక్షం/మర్రిగూడ: హెల్త్ డిపార్ట్మెంట్ ఐసిడిఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహార లోప చిన్నారులకు , గర్భిణీ లకు వైద్య పరీక్షలు నిర్వహించారు. పిల్లల తల్లులకు పౌష్టికాహార లోపం వల్ల వచ్చే అనారోగ్యాలు, గర్భిణీలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహారం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ దీపక్, డా అరుణతార డా శాలిని, ఐసిడిఎస్ సూపర్వైజర్ యశోద,శ్రీలత అంగన్వాడి రమాదేవి, లక్ష్మి, విమలాదేవి,వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## మానవత్వం చాటిన వేళ



ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్: పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారి చల్లా లక్ష్మీకాంత్ మానవత్వంతో తనకు రోడ్డు పక్కన దొరికిన నగదు రూ.35వేలను నగదు పోగొట్టుకున్న రాజేష్ అనే వ్యక్తికి అందచేశారు. తాను పోగొట్టుకున్న నగదు తిరిగి దొరకడంతో రాజేష్ సంతోష్ వ్యక్తం చేసి చల్లా లక్ష్మీకాంత్‌కు ధన్యవాదాలు తెలిపారు. మానవత్వం ప్రదర్శించి తనకు దొరికిన నగదును పోగొట్టుకున్న వ్యక్తికి అందచేసిన చల్లా లక్ష్మీకాంత్‌ను పలువురు ప్రముఖులు,వ్యాపారులు అభినందనలు తెలిపారు.

**నగదు తిరిగి వెనక్కి...**



ప్రజాపక్షం/నందికొండ: నందికొండ మున్సిపాలిటీ హిల్ కాలనీకి చెందిన వెంకటసుబ్బయ్య స్థానికంగా ప్రైవేటు ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. గురువారం ఎక్కడి నుంచో అతనికి తన బ్యాంక్ అకౌంట్ కి 50 వేల రూపాయల నగదు ఫోన్ పే ద్వారా జమ కావడంతో వెంటనే వెంకటసుబ్బయ్య తన ఫోన్లో ఎకౌంటుకు సంబంధించిన వివరాలను చూసుకోగా ఆ నగదు జమ చేసిన వ్యక్తి నల్లగొండ జిల్లా చేపూరు గ్రామానికి చెందిన ఆంజనేయులుగా గుర్తించి వెంటనే ఫోన్ పేలో ఉన్న నెంబర్‌కు ఫోన్ చేసి వివరాలు అడిగి తెలుసుకోగా అతను ఒకరికి నగదును వేయబోయి పొరపాటున మీకు పంపడం జరిగిందని వెంటనే అతను నా ఫోన్ పేకు తిరిగి జమ చేయవలసిందిగా వేడుకోవడంతో ఆ ప్రైవేటు ఉపాధ్యాయుడు నేను అలా పంపలేను ఈ రోజుల్లో ఆన్లైన్ మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయి.మీరు ఆధార్ కార్డు పాన్ కార్డు తీసుకుని నా వద్దకు వస్తే బ్యాంకు నుంచి డ్రా చేసి మీకు మీ నగదును ఇచ్చేస్తానని తెలపడంతో నగదు పోగొట్టుకున్న వ్యక్తి శుక్రవారం నాగార్జునసాగర్ వచ్చి తనను కలవటంతో వెంటనే ఆ వ్యక్తి 50 వేలు డ్రా చేసి ఆ నగదును తిరిగి అతనికి ఇచ్చివేయడం జరిగింది. దీనితో ఆ వ్యక్తి ఉపాధ్యాయునికి కృతజ్ఞతలు తెలిపారు. నిజాయితీ చాటుకుని నగదును తిరిగి ఇచ్చివేయటం పట్ల స్థానికులు ఆ ఉపాధ్యాయుడిని అభినందించారు.

## గోమాతకు ప్రత్యేక పూజలు



ప్రజాపక్షం/హుజూర్‌గర్‌రూరల్: మండలంలోని బూరుగడ్డ శ్రీఆదివరాహలక్ష్మీ నరసింహ వేణుగోపాలస్వామి దేవాలయంలో శుక్రవారం గోమాతకు గోపూజా కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు హరీష్‌కుమారచార్యులు నిర్వహించారు.కాగా ఆలయంలో గోదాదేవి అమ్మవారిని ప్రత్యేక అలంకరణ గావించి పూజలు జరిపారు.కార్యక్రమంలో ఆలయ ఈవో ఎమ్.పి లక్ష్మణ్‌రావు, మంగళగిరి చలమాచార్యులు,మనోహర్, ప్రదీప్‌శర్మ,తులసిరామ్,కనకయ్య,పవీణ్,సంధ్య,వెంకటమ్మ,అరణ్య,ప్రవీణ్,ఆలయ సిబ్బంది గోవిందరెడ్డి,కిరణ్‌గౌడ్,రమేష్,ఉపేందర్,భక్తులు పాల్గొన్నారు.

## ముత్యాలమ్మ కనకదుర్గమ్మ జాతర

ప్రజాపక్షం/హుజూర్‌నగర్‌రూరల్: మండంలోని బూరుగడ్డ గ్రామంలో ముత్యాలమ్మ,కనకదుర్గమ్మ జాతరను గ్రామస్తులు శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు.భక్తులు పెద్ద ఎత్తున జాతరలో పాల్గొని అమ్మవార్లకు తమ మొక్కులను చెల్లించుకున్నారు.కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అరుణ్‌కుమార్‌దేశ్‌ముఖ్, గ్రామ పెద్దలు, పాల్గొన్నారు.

## ధర్నాను జయప్రదం చేయండి



ప్రజాపక్షం/డిండి: అధిక ధరలను నిరసిస్తూ సెప్టెంబర్ 02న నల్గొండ జిల్లా కలెక్టరేట్ వద్ద సిపిఐ ఆధ్వర్యంలో నిర్వహించే ధర్నాను జయప్రదం చేసేందుకు సిపిఐ డిండి మండల నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై ధర్నాను జయప్రదం చేయాలని సిపిఐ డిండి మండల కార్యదర్శి శ్రీరామదాసు కనకాచారి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ పేదవాడు జీవనం సాగించలేని విధంగా రోజు రోజుకు పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను ప్రభుత్వాలు అదుపు చేసి సామాన్యులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కలెక్టరేట్ల వద్ద సెప్టెంబర్ 02న రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు నిర్వహిస్తున్నట్లు కనకాచారి తెలిపారు.

## అనుమానాస్పద స్థితిలో వివాహిత ఆత్మహత్య



ప్రజాపక్షం/గుర్రంపోడు: మండల పరిధిలోని ముల్కలపల్లి గ్రామంలో గురువారం సాయంత్రం అనుమానాస్పద స్థితిలో వివాహిత ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన చోటుచేసుకుంది. ఎస్ఐ వేమిరెడ్డి నారాయణరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ముల్కలపల్లి గ్రామానికి చెందిన జాల రజిత(30) ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిందని, ఆ సమయంలో రజిత భర్త దుర్గయ్య పశువులను కాసుకుంటూ వ్యవసాయ బావి వద్ద ఉన్నాడని అన్నారు. బుధవారం రజిత తల్లిగారింటికి వెళ్లి ఆమె ఇద్దరు పిల్లలను తమ్ముడు రమేష్ తీసుకొని రాగా ఇంట్లో రజిత ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొని కనిపించిందని రజిత మృతిపై గ్రామానికి చెందిన జాల రాములుపై అనుమానం ఉన్నట్లు భర్త దుర్గయ్య పోలీసులకు ఫిర్యాదులో పేర్కొన్నాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## రైతుల రుణమాఫీ షెడ్యూల్

ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి: మండలంలోని మున్సిపాలిటీ పరిధిలోని గ్రామాలతో సహా అన్ని గ్రామాల వారీగా తేదీల ప్రకారం రైతుల రుణమాఫీ జరిగే షెడ్యూల్‌ను మండల వ్యవసాయ అధికారి కే.శైలజ శుక్రవారం ఒక ప్రకటనలో విడుదల చేశారు. ఆ షెడ్యూల్ ప్రకారం నిన్నటి నుంచి వచ్చేనెల 18 వరకు రెండు స్లాబ్ లు ఉ.10 నుండి ఒంటిగంట, మ. 2 గం. నుండి సా 5గం.ల లోపు రైతుల రుణమాఫీ జరిగే ప్రక్రియను తెలిపారు.

## బాలుడు మృతి

ప్రజాపక్షం/కొండమల్లేపల్లి: మంచి నీటి సంపులో పడి బాలుడు మృతి చెందిన సంఘటన గురువారం రాత్రి మండల కేంద్రంలోని పాత ఊరులో జరిగింది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూల్ జిల్లాకు చెందిన చాకలి వీరస్వామి ఉమ దంపతులు పొట్టకూటి కోసం మూడు సంవత్సరాల క్రితం కొండమల్లేపల్లికి వచ్చి తాపి మేస్త్రీగా పనిచేస్తూ జీవనం వెళ్లదీస్తున్నారు. వారికి ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఈశ్వర్(6) ఉన్నారు. గురువారం రాత్రి ఈశ్వర్ తోటి స్నేహితులతో ఆడుకుంటూ వారి చుట్టాల ఇంటికి పరిగెత్తి గేటు తీసి లోపలికి వెళుచుండగా అనుకోకుండా గేటుపక్కనే ఉన్న సంపులో పడిపోయాడు. కొంచం ఆలస్యంతో స్నేహితులు కుటుంబ సభ్యులకు, ఇరుగు పొరుగు వారికి చెప్పడంతో వారు వచ్చి బాలుడిని సంపులో నుండి తీశారు. చికిత్స నిమిత్తం బాలుడిని దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మరణించినట్లు డాక్టర్ తెలిపారు. బాలుడి మృతి పై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ రామ్మూర్తి తెలిపారు.

# అధిక ధరలకు వ్యతిరేకంగా కలెక్టరేట్ ముందు ధర్నా



ప్రజాపక్షం/మునుగోడు: కేంద్ర ప్రభుత్వ పాలనలో పెరుగుతున్న నిత్యావసర వస్తుల అధిక ధరలకు వ్యతిరేకంగా సెప్టెంబర్ 2న సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట చేపట్టబోయే ధర్నాను విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం అన్నారు. శుక్రవారం మునుగోడు మండల కేంద్రంలో సిపిఐ కార్యాలయంలో జరిగిన మునుగోడు నియోజకవర్గం స్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి మూడోసారి పూర్తి స్థాయిలో మెజార్టీ రాకపోయినప్పటికి గత విధానాలే అవలంభిస్తుందని ఆరోపించారు. సంపన్న వర్గాలకే మేలు జరిగే విధంగా వ్యవహరిస్తున్నారు తప్పా పేద సామాన్య ప్రజలపై పెరుగుతున్న ధరల భారాన్ని తగ్గించలేకపోతున్నారని మండిపడ్డారు. ఇప్పటికే అన్ని రకాల వస్తువుల ధరలు పెరిగిపోయి సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. పెరుగుతున్న ధరలు తగ్గించేందుకు సిపిఐ ఉద్యమాల ద్వారా బిజెపి ప్రభుత్వాన్ని ఎండగట్టాలని పిలుపునిచ్చారు. అందులో భాగంగా సెప్టెంబర్ 2న నల్లగొండ జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గురిజ రామచంద్రం,ఆర్ అంజయ్య చారి, బొలుగురి నరసింహ, బచ్చనబోయిన గాలయ్య, చాపల శ్రీను,నల్పరాజు సతీష్, భాస్కర్, బిక్షం రెడ్డి, ఎన్ రామలింగయ్య తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు అధికారులకు ఘన సత్కారం



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : పోలీస్ శాఖలో విధులు నిర్వర్తిస్తూ పదవీ విరమణ పొందిన హెడ్ కానిస్టేబుల్స్ బసవయ్య, రంజిత్ సింగ్, పాలన విభాగంలో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ మహబూబ్ అలీలను శుక్రవారం నల్లగొండ జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవర్ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ సుదీర్ఘ కాలంగా పోలీస్ శాఖలో పని చేస్తూ ప్రజలకు సేవలు అందించి పూర్తి ఆరోగ్యంతో పదవి విరమణ పొందడం అభినందనీయం అన్నారు. తమ శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా గడపాలని తెలిపారు. భవిష్యత్తులో ఏ విధమైన సమస్యలు తలెత్తినా వెంటనే తమను సంప్రదించాలని వారికి తెలియజేశారు. అనంతరం పదవీ విరమణ పొందిన పోలీసు అధికారుల కుటుంబాల ప్రస్తుత స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. పదవీ విరమణ అనంతరం ప్రభుత్వం నుంచి వారికి చెందాల్సిన అన్ని రకాల బేనిఫిట్స్ త్వరితగతిన అందేలా చర్యలు చేపట్టాలని జిల్లా పోలీస్ కార్యాలయ అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పి రాములు నాయక్, ఎస్బి డిఎస్పి రమేష్,ఏఓ శ్రీనివాస్,జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షులు జయరాజు, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

## ధరల నియంత్రణలో కేంద్రం విఫలం



ప్రజాపక్షం/మిర్యాలగూడ: అడ్డుఅదుపు లేకుండా పెరిగిపోతున్న నిత్యావసర ధరలను నియంత్రించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు అన్నారు. సీపీఐ మిర్యాలగూడ మండల కార్యదర్శి మహ్మద్ సయీద్ అధ్యక్షతన జరిగిన నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం సెప్టెంబర్ 2న జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట జరిగే ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నింగినంటుతున్న ధరలను నివారించడంలో ప్రధానమంత్రి మోడి నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం బాధాకరమన్నారు. కేంద్ర ప్రభుత్వం పేదలపై భారాలు మోపుతూ సంపన్నులకు రాయితీలు కల్పించడం ఎంతవరకు సమంజసమని అన్నారు. ప్రజా సమస్యలను విస్మరిస్తే పుట్టగతులు ఉండవని హెచ్చరించారు. సమావేశంలో వేములపల్లి మండల కార్యదర్శులు ధీరావత్ లింగానాయక్, జిల్లా యాదగిరి, మండల సహాయ కార్యదర్శి అంజనపల్లి రామలింగం, దళిత హక్కుల పోరాట సమితి నియోజకవర్గ కన్వీనర్ వల్లంపట్ల వెంకన్న,తదితరులు పాల్గొన్నారు.

## రుణ మాఫీ కాని రైతుల దరఖాస్తుల స్వీకరణ



ప్రజాపక్షం/మోటకొండూరు: రేషన్ కార్డు లేక ఋణమాఫీ పథకం అమలు కాని రైతుల నుండి దరఖాస్తులు స్వీకరిస్తూ కుటుంబ సభ్యులను నిర్ధారణ కోసం పోటోలు తీసి అప్లోడ్ చేస్తున్నట్లు మోటకొండూరు ఎఓ రమాదేవి తెలిపారు. ఆమే మోటకొండూరు మండల కేంద్రంలో గురు, శుక్రవారాలలో 190 మంది నుండి దరఖాస్తులు స్వీకరించినట్లు, మండలంలోని వివిధ గ్రామాలలో 1197 మంది లబ్దిదారులు ఉన్నట్లు, వ్యవసాయ అధికారులు ప్రతి గ్రామంలో దండోర వేయించి ప్రకటించిన తేదిలలో వస్తారని ప్రజలు అవకాశం వినియోగించుకోని దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఈఓలు శివాని, సంధ్య, సురేష్ రైతులు పాల్గొన్నారు.

## పారిశుధ్య పనుల పరిశీలన



ప్రజాపక్షం/మిర్యాలగూడ: పట్టణంలో శుక్రవారం తెల్లవారుజామున పారిశుధ్య పనులను మున్సిపల్ కమీషనర్ ఎండి.యూసుఫ్ పరిశీలించారు. పట్టణంలో ప్రజలు వైరల్ జ్వరాల బారిన పడుతున్నందున పారిశుద్ధ్య కార్మికులు పారిశుద్ధ్యం సక్రమంగా చేపట్టాలన్నారు. రెడ్డికాలనీ, సంతోష్‌నగర్‌లోని మురుగుకాల్వల్లో మురుగుతీత, పిచ్చిమొక్కల తొలగింపు పనులను పరిశీలించారు. దోమల నివారణకు ఫాగింగ్, నీరు నిల్వ ఉన్న చోట ఆయిల్ బాల్స్ వేస్తున్నట్లు తెలిపారు కార్యక్రమంలో శానిటరీ ఇన్స్‌పెక్టర్ వెంకటరమణ, కార్మికులు ఉన్నారు.

## స్నేహితుల ఆర్థిక సహాయం



ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం): జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆత్మకూర్ 2001 బ్యాచ్ చెందిన స్నేహితురాలు బిర్రు మంజుల తల్లి బిర్రు జయమ్మ(60) గత వారం మృతి చెందారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదవ తరగతి 2001 బ్యాచ్ తరుపున స్నేహితురాలి కుటుంబానికి రూ.13,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పదవ తరగతి బ్యాచ్ స్నేహితులు చెరుకు వెంకన్న, ఎలగందుల శీను, రాగటి సత్యనారాయణ, ఎద్దు మచ్చగిరి, పొన్నబోయిన మహేష్, యాస రవి తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ సౌదా ముట్టడిని విజయవంతం చేయాలి



ప్రజాపక్షం/బీబీనగర్ : సెప్టెంబర్ 4వ తేదీన హైదరాబాద్‌లో జరిగే విద్యుత్ సౌదాలు ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీసీ ఓబీసీ ఐక్య కార్యచరణ సంఘం బీబీనగర్ సబ్ డివిజన్ ఎడిఈ ఆర్.కృష్ణయ్య, ఏఈ మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో పిఆర్‌జి గార్డెన్లో జరిగింది. ఈ సందర్భంగా ధర్నా ముట్టడి వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం 2014 నుండి నష్టపోయిన బీసీ మరియు ఓసి ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఏపీ రూల్స్ అమలు చేసి పదోన్నతులు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు నరేష్, బాల నరసింహా, కే.భూపాల్ రెడ్డి, కేశవరెడ్డి, జంగయ్య, రాజరత్నం పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధికి సహకరించాలి



ప్రజాపక్షం/వలిగొండ : వలిగొండ మండలం వెంకటాపురం గ్రామాభివృద్ధికి అధిక నిధులు మంజూరు చేసి సహకరించాలని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డిని వెంకటాపురం గ్రామ మాజీ సర్పంచ్ కొత్త వెంకటేశం కోరారు. భువనగిరి జిల్లా కేంద్రంలో భువనగిరి నియోజకవర్గ నీటి పారుదల శాఖ సమీక్షా సమావేశంలో మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పర్యటన సందర్భంగా ఆయన పాల్గొని నిధులు కేటాయించి గ్రామంలోని పెండింగ్ పనులను పూర్తి చేయించాలని కోరారు.